క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


డీటీ నిజముద్దీన్

హొళగుంద: హొళగుంద డిప్యూటీ తహసీల్దారుగా నిజముద్దీన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ డీటీగా పనిచేస్తున్న దీప కొద్ది రోజులు ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి డెప్యూటేషన్‌పై వెళ్లారు. సాధారణ బదిలీల్లో భాగంగా అక్కడినుంచి ఆమెను జిల్లా కలెక్టర్ పెద్దకడుబూరుకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో తుగ్గలిలో డీటీగా పనిచేస్తున్న నిజముద్దీన్‌ను హొళగుందకు నియమించగా ఆయన గురువారం విధుల్లో చేరారు.

నాణ్యత లోపిస్తే నిధుల రికవరీ


రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ ఈఈ నాగేశ్వర్ రెడ్డి

ఆలూరు: ఆలూరు నియోజకవర్గంలో సీసీ, బీటీ రోడ్ల పనులలో నాణ్యత లోపిస్తే సంబంధిత కాంట్రాక్టర్ నుంచి నిధులు రికవరీ చేస్తామని క్వాలిటీ కంట్రోల్ ఈఈ నాగేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన గురువారం దేవనకొండ మండలం పుల్లాపురం, వయా కొత్తపేట మార్గంలో రూ.2.50 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దాదాపు 20 రోడ్ల నాణ్యత ప్రమాణాలను పరిశీలించినట్లు చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న పనులపై సంబంధిత ఏఈలు పర్యవేక్షణ చేయాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ డీఈ హెచ్‌డీ ఈరన్న, పీఐయూ డీఈ భాస్కర్, ఏఈ వెంకటసాయి తదితరులు ఉన్నారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య


నరసింహుడు (ఫైల్)

దేవనకొండ: మండలంలోని గుడిమిరాళ్ల గ్రామంలో నల్లబోతుల నరసింహుడు (38) అనే రైతు ఈనెల 6వ తేదీన అప్పుల బాధ తాళలేక పురుగు మందు సేవించగా చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతిచెందాడు. వివరాలు.. మండలంలోని గుడిమిరాళ్ల గ్రామానికి చెందిన నల్లబోతుల నరసింహుడు తనకున్న 5 ఎకరాలతో పాటు మరో 10 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గతేడాది అతివృష్టి, ఈ ఏడాది అనావృష్టితో తీవ్రంగా నష్టపోయాడు. ఖర్చులు కూడా రాకపోవడంతో గత ఐదేళ్ల నుంచి దాదాపు రూ.20 లక్షలు అప్పులు చేశాడు. అప్పులను ఎలా తీర్చాలో తెలియక జీవితంపై విరక్తి చెంది ఈనెల 6న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక గురువారం మృతిచెందినట్లు భార్య సోమేశ్వరి తెలిపారు. మృతుడి భార్య సోమేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

శరవేగంగా రోడ్డు పనులు

మద్దికెర: మండల కేంద్రం నుంచి మొలగవెళ్లి వరకు 14 కి.మీ మేర రూ.14 కోట్లతో చేపట్టిన తారు రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రత్యేక శ్రద్ధతో రోడ్డు పనులు చేయిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎన్నికల కంటే ముందే రోడ్డు పనులు పూర్తి చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. రోడ్డు పూర్తయితే మొలగవెళ్లి, ఆలూరు తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి సౌకర్యంగా ఉంటుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కింద పడి వ్యక్తి మృతి

హొళగుంద: గజ్జహల్లి గ్రామానికి చెందిన అంజి (35) అనే వ్యక్తి గురువారం ఇంటి ముందు కింద పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సదరు వ్యక్తి ఇంటి అరుగుపై కూర్చుని ఉండగా ఉన్నట్టుండి స్పృహ తప్పి కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది పెద్దహరివాణం ఆస్పత్రికి పంపించారు. అక్కడి వారు మెరుగైన చికిత్స కోసం ఆదోనికి రెఫర్ చేశారు. ఆదోనికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

పి.కోటకొండలో మలేరియా కేసు నమోదు


ఇంటిలో శుభ్రతను పరిశీలిస్తున్న జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామంలో ఓ వ్యక్తి మలేరియా నిర్ధారణ అయినట్లు సబ్ యూనిట్‌ఆఫీసర్ సాయిబాబా తెలిపారు. ఇందులో భాగంగా గురువారం జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్ గ్రామాన్ని సందర్శించి గ్రామంలో దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు. ఇంటింటికి తిరిగి జ్వరం లక్షణాలున్న వారికి రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయడం జరిగిందని చెప్పారు. ప్రజలు దోమకాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సుంకన్న, సూపర్‌వైజర్లు రంగస్వామి, శ్రీధర్, జయలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి


హాజరైన వైఎస్సార్‌సీపీ నందవరం మండలశ్రేణులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మిగనూరులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించి మరోసారి పార్టీ జెండాను ఎగురవేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని కుర్ణి కళ్యాణ మండపంలో నందవరం మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లను పార్టీ సమన్వయకర్త బుట్టా రేణుకకు పరిచయం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి స్థానాన్ని బీసీలకు కేటాయించాలన్న అధిష్టానం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఐదేళ్లుగా సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. విద్య వైద్య రంగాలకు ప్రాధాన్యతనిచ్చారని, గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి లక్షన్నర మందికి పైగా ఒకేసారి ఉద్యోగాలు కల్పించారని వివరించారు. గత టీడీపీ పాలన అంతా అవినీతిమయం అని, ప్రజాసంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా వుండి వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

మండల అభివృద్ధికి కృషి చేస్తా:

నందవరం మండలాభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రజా సంక్షేమం, అభివృద్ధిని సమానంగా అమలు చేస్తున్నారని చెప్పారు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పథకాల నగదును నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలో జమచేస్తూ ఆదర్శపాలన సాగిస్తున్నారని కొనియాడారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలతో ప్రజలు మోసపోయారని, అలాంటిది పునరావృతం కాకుండా ప్రజలను చైతన్యపరిచి మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మిగనూరు మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతారెడ్డి, నియోజవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు విరుపాక్షి రెడ్డి ప్రసంగించారు. పార్టీ నాయకులు బుట్టా నీలకంఠప్ప, ప్రత్యూల్, ప్రకాష్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, బోయ వెంకటేష్, షేక్ అహ్మద్, రాజాశరత్, పల్లె శంకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చాంద్‌బాషతో పాటు పలు గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి

ఎమ్మిగనూరుటౌన్: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు వారి పేరిట అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుక పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం స్థానిక కుర్ణి కల్యాణ మండపంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మహిళలనుద్దేశించి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళల సంక్షేమం, అభ్యున్నతికి పెద్దపీట వేశారని వివరించారు. మెప్మా పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు హేమలతా రెడ్డి, మెప్మా సీఎంఎం జయవర్ధన్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు ప్రసంగించారు. కుర్ణికరికల కార్పొరేషన్ చైర్మన్ బుట్టా శారదమ్మ, శాప్ నెట్‌వర్క్ చైర్మన్ మాచాని వెంకటేష్, బుట్టారంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేలంలో పెరిగిన ఆదాయం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మేజర్ పంచాయతీ వేలాలలో గతేడాది కంటే రూ.9 లక్షల ఆదాయం పెరిగింది. మొత్తంగా రూ.36,91,900 ఆదాయం లభించింది. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ముత్యాల శైలజ, ఇన్‌చార్జ్ ఈఓ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలాలలో ముఖ్యంగా పార్కింగ్ ఫీజు హక్కులకు వేలందారులు పోటీ పడ్డారు. గతేడాది కంటే ఏకంగా రూ.9,70,000లకు (గతేడాది రూ.6 లక్షలు) అధికంగా అనగా రూ.15,70,000లకు బాలు దక్కించుకున్నాడు. మిగతా వాటిలో దినసరి కూరగాయాల మార్కెట్ రూ.90 వేలు తగ్గింది. మొత్తంగా వారపు సంత మార్కెట్ రూ.3,07,000లకు, దినసరి కూరగాయల మార్కెట్ రూ.2,52,000లకు, జంతువధ శాల రూ.1,26,000లకు, ఆర్‌కే రోడ్డులోని 8 రూములు రూ.10,84,000లకు, సంత మార్కెట్ రూములు రూ.3,30,000లకు, మాంసపు అంగళ్లు రూ.21,600లకు వ్యాపారులు దక్కించుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, ఎంపీటీసీ రవి రెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్ నిర్మాణానికి నిధుల మంజూరు

మద్దికెర: మండల కేంద్రంలోని ప్రధాన బజారులో కాయగూరల మార్కెట్‌ను నిర్మించేందుకు నాబార్డు నిధులు రూ.18.50 లక్షలు మంజూరైనట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ నాగేశ్వర రెడ్డి గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలో మార్కెట్ నిర్మాణానికి త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.రూ.3.50 లక్షలు కంట్రిబ్యూషన్ కింద స్థానికులు అర్థేగేరి రామకృష్ణారెడ్డి కుటుంబీకులు చెల్లించగా ప్రభుత్వం రూ.15లక్షలు మంజూరు చేసిందన్నారు.

ప్రజలకు చేరువగా ప్రభుత్వ పాలన


ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న సర్పంచ్ దేవేంద్రగౌడ్, ఎంపీడీఓ కొండన్న

ఎమ్మిగనూరురూరల్: గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, ఆరోగ్య కేంద్రాలతో ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువయ్యాయని సర్పంచ్ దేవేంద్రగౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మల్కాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్, ఆర్‌బీకే కేంద్రాలను సర్పంచ్ దేవేంద్రగౌడ్, ఎంపీటీసీ ధనుంజయ, ఎంపీడీఓ కొండన్న, ఈఓఆర్డీ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపీటీసీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో గ్రామాల్లోనే ప్రజలకు ప్రభుత్వ సేవలందుతున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల వల్ల రైతులకు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు ఇక్కడే అందుతున్నాయని, విలేజ్ క్లినిక్‌లో డాక్టర్లు ఎల్లవేలలా అందుబాటులో ఉండి వైద్యసేవలందిస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీఓ కొండన్న మాట్లాడారు. నాయకులు పెద్దయ్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు పక్కాగా నిర్వహించాలి


మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల ఆర్‌ఓ చిరంజీవి

నందవరం: రాబోయే సార్వత్రిక ఎన్నికలలో బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, ఆర్వోలు పక్కాగా విధులు నిర్వర్తించాలని డిప్యూటీ కలెక్టర్, ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిరంజీవి ఆదేశించారు. గురువారం నందవరం రెవెన్యూ కార్యాలయంలో తర్వలో జగరబోయే సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి అధికారులకు సమాచారం అందించాలన్నారు. అలాగే గ్రామాల్లో ఓటర్లకు ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) పనితీరుపై అవగాన కల్పించాలని సూచించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు పోలింగ్ బూత్‌లలో విద్యుత్, తాగునీరు, ర్యాంపులు, ఫ్యాన్లు వంటి సదుపాయాలను పరిశీలించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి అధికారి సహకారించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఓబులేసు ఆధ్వర్యంలో నందవరం, నాగలదిన్నె, ముగతి, మిట్టసోమపురం, సోమలగూడూరు తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను డిప్యూటీ కలెక్టర్, ఆర్‌ఓ పరిశీలించారు. ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, డీటీ రఘువీరా, ఆర్‌ఐ జెర్మియా, ఎన్నికల సూపర్‌వైజర్లు ఎంఈఓ రఘునాథ్, ఏఎస్‌ఓ సూర్యప్రకాష్, వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న, పరిపాలన అధికారి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'బ్రహ్మగుండం' ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు


చైర్మన్, ఎస్‌ఐలతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

వెల్దుర్తి(కృష్ణగిరి): బ్రహ్మగుండం క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలకు పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను గురువారం పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ సురేశ్‌కుమార్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సీఐ, ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డితో కలసి విలేకరులతో మాట్లాడుతూ.. ఉత్సవాలకు 60 మంది పోలీసులతో బందోబస్తు ఉంటుందన్నారు. మహిళా పోలీసులు, స్వచ్ఛంద వలంటీర్ల సేవలు ఉపయోగించుకుంటామన్నారు. ఆలయ కల్యాణ మండపం ఎదురుగా 24 గంటల సేవలతో పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఏ చిన్న అవసరం, సమాచారం కోసం అక్కడ సంప్రదించవచ్చన్నారు. రామళ్లకోట వైపు పొలంలో అటు వైపు నుంచి వాహనాలకు, వెల్దుర్తి వైపు నుంచి వచ్చే వాహనాలకు రామిరెడ్డి మైన్స్ నందు పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. స్వామివారి కళ్యాణాన్ని భక్తులు వీక్షించేందుకు భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అత్యవసర సహాయానికి 91211 01118, 91211 01114 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం


గూళ్యంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న బి.విరూపాక్షి

హాలహర్వి: సీఎం వైఎస్ జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.విరూపాక్షి పేర్కొన్నారు. మండలంలోని గూళ్యం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం-1 భవనాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ముందుగా గూళ్యం గాదిలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. ఎంతమంది కలిసి వచ్చినా ప్రజలు వైఎస్సార్‌సీపీవైపే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో ఘన విజయం సాధించడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. 14 ఏళ్లపాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబునాయుడు అభివృద్ధిని మరిచాడని, అన్ని రంగాల ప్రజలను మోసగించారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం సచివాలయంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని సిద్ధాపురం, బల్లూరు, అమృతాపురం, జె.హొసళ్లి గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్‌లు ఉలిగమ్మ, మారెన్న, నాయకులు గాదిలింగ, బజారప్ప, రామిరెడ్డి, మల్లికార్జున, జనార్దన్‌నాయుడు, పక్కీరమ్మ, మారయ్య పాల్గొన్నారు.

పార్టీ ఆదేశాలకు కట్టుబడి ఉంటాం

చిప్పగిరి: తాజా మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం స్వప్రయోజనాల కోసమే టీడీపీలో చేరారని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం మండల ఉపాధ్యక్షులు నరసింహులు, నంచర్ల సర్పంచ్ బీమ ఆధ్వర్యంలో నంచర్ల గ్రామ నాయకులు, కార్యకర్తలు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలే తమకు శిరోదార్యం అని, ఎవరు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా పార్టీని వీడేది లేదన్నారు. పార్టీ అభ్యర్థి గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. నాయకులు మీసాల హనుమంతు, మహేష్, రామంజి, సి.హరి, గుంతల హనుమంతు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

హాలహర్వి: రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సేవలు వినియోగించుకునేలా కొత్త కార్డులను మంజూరు చేసిందని ఎంపీడీఓ ఆంతోనీ తెలిపారు. ఈ మేరకు గురువారం వలంటీర్ల ద్వారా మండలంలోని హాలహర్వి, చింతకుంట, కొక్కరచేడు, గూళ్యం, నిట్రవట్టి తదితర గ్రామాల్లోని లబ్ధిదారులకు అందించారు. ఆరోగ్యశ్రీ కార్డుల ప్రయోజనాలను వివరించారు. లబ్ధిదారులు ఆరోగ్యశ్రీ కార్డు సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

ఆలూరు: బీటీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని పీఆర్ ఎస్‌సీ సుబ్రమణ్యం ఆదేశించారు. చిప్పగిరి గ్రామం నుంచి దౌల్తాపురం, మద్దికెర వరకు రూ.10 కోట్లతో జరుగుతున్న రోడ్డు పనులను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలూరు నియోజకవర్గంలో ఏపీ సీఆర్‌ఎఫ్ గ్రాంటు కింద ఏపీ ఎంఐపీ కింద 24 రోడ్ల పనులకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.75 కోట్ల వరకు నిధులు మంజూరయ్యాయిన్నారు. దాదాపు అన్ని రోడ్ల పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. గడువులోగా పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.ఆలూరు పీఐయూ డీఈ భాస్కర్, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు ఉన్నారు.

నారా భువనేశ్వరి పరామర్శ

తుగ్గలి/కృష్ణగిరి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి గురువారం కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో మృతుల కుటుంబాలను పరామర్శించారు. మీటే తండాకు చెందిన టీడీపీ ఎంపీటీసీ మాజీ సభ్యురాలు రమావత్ లక్ష్మిబాయి నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే కడమకుంట్లలో వడ్డె చిన్నరాముడు బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. వీరి కుటుంబాలను గురువారం నారా భువనేశ్వరి పరామర్శించారు. ఆ కుటుంబ సభ్యుల ఖాతాలకు రూ.3 లక్షలు జమ చేశారు. ఆ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జ్ కేఈ శ్యాంబాబు, టీడీపీ నాయకులు ఉన్నారు. అలాగే కృష్ణగిరి మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామానికి చెందిన దూదేకుల సుభాన్ కుటుంబాన్ని పరామర్శించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామంలో ఉలిగమ్మవ్వ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా గణపతి పూజ, నవగ్రహ ఆరాధన, శ్రీ దుర్గ, చండీ, సరస్వతి, మహాలక్ష్మి, హోమ పూజలతో పాటు మంగళ హారతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను పూర్తిచేయాలి

హాలహర్వి: ఆలూరు నియోజకవర్గంలోని వేదావతి, నగరడోణ ప్రాజెక్టులను పూర్తి చేసి హంద్రీ - నీవా కాలువకు తూము ఏర్పాటు చేసి ఆలూరు బ్రాంచి కెనాల్ (ఏబీసీ)కి సాగునీటిని అందించాలని వేదావతి ప్రాజెక్ట్ సాధన కమిటీ తాలూకా అధ్యక్షుడు ఎల్లార్తి అర్జున్, సభ్యులు సురేంద్ర కోరారు. ఈ మేరకు గురువారం వారు గూళ్యంలోని గాదిలింగేశ్వరస్వామి ఆలయం నుంచి ఆలూరు వరకు పాదయాత్ర చేపట్టారు. వారు మాట్లాడుతూ వేదావతి నీటిని ఆస్పరి మండలం వరకు కొనసాగించాలన్నారు. నగరడోణ రిజర్వాయర్ పనులను పూర్తి చేయాలన్నారు. కమిటీ సభ్యులు సురేంద్ర, పెద్దహోతూరు మధు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా బట్టీలపై దాడులు

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామ కొండల్లో గురువారం నాటు సారా బట్టీలపై దాడులు చేసినట్లు ఆస్పరి సీఐ హనుమంతప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కైరుప్పల కొండల్లో నాటు సారా తయారు చేస్తున్న బట్టీలపై దాడులు చేసి 50 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. నాటుసారా అమ్ముతున్న ఈరన్న, వీరభద్రిలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు

హొళగుంద: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న మూడు రోడ్ల కూడలిలో ఎస్ఎస్‌వీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్కే గిరి, కోగిలతోట శేషప్ప తదితరులు గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆదోని, ఆలూరు, హొళగుంద రోడ్డులో ప్రయాణించే వారి దాహార్తి తీర్చేందుకు సంస్థ సభ్యులు చల్లని తాగునీటిని ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు.

కస్తూర్బా విద్యాలయం తనిఖీ

ఆస్పరి: స్థానిక కస్తూర్బా విద్యాలయాన్ని గురువారం ఏపీసీ విజయజ్యోతికుమారి అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని స్టోర్ రూం, కూరగాయలు, వాటర్ ప్లాంటును పరిశీలించి సమస్యలపై ప్రిన్సిపాల్ షారోన్ స్మైయిలీ, విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఏపీసీ మాట్లాడుతూ.. పాఠశాలలో మంచి నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. పాత బోర్లకు మరమ్మతులు చేయించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. గ్రామ సర్పంచ్ మూలింటి రాధమ్మ పాఠశాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయిస్తున్నారని ప్రిన్సిపాల్ చెప్పగా నీరు చాలకపోతే అదనంగా మరో ట్యాంకర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.

సీఎం జగనన్నతోనే ప్రజా సంక్షేమం


ఎమ్మిగనూరు 1వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: బడుగుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టి సీఎంగా జగనన్నను మరోసారి గెలిపించుకోవాలని నియోజకవర్గ సమన్వయకర్త బుట్టరేణుక పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 1వ వార్డులో వార్డు కౌన్సిలర్ కామర్తి నాగేషప్ప, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, పార్టీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, జిల్లా వక్ఫ్‌బోర్ద్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, పలు వార్డుల కౌన్సిలర్లతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌కు ఓటు వేయాలంటూ ప్రజలను అభ్యర్థించారు. అంతకుముందు స్థానిక నీలంతేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం రెండో రోజు ప్రచారాన్ని ప్రారంభించగా, ఆ వార్డులోని మహిళలు సాధరంగా ఆహ్వానించి పార్టీకి మద్దతిస్తామని హామీ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనలో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని, ఎన్నికల సమయంలో టీడీపీ నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మక జగనన్నకే మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. కౌన్సిలర్లు అంపమ్మ, నీలకంఠ, ఖాశీంబేగ్, అమాన్, ఇషాక్, రాజారత్నం, సుధాకర్, షాబుద్దీన్, కోటకొండ నరసింహులు, చంద్రశేఖర్, సూరి, ఇలియాజ్, సయ్యద్‌చాంద్, తదితరులు పాల్గొన్నారు.

'మేము సిద్ధం. .మా బూత్ సిద్ధం'తో శ్రేణుల్లో జోష్


రామకొండలో పార్టీ జెండాలతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు


'సిద్ధం' సామగ్రి అందజేస్తున్న కంగాటి రామ్మోహన్ రెడ్డి, కార్యకర్తలు

తుగ్గలి: మండల పరిధిలోని శభాష్‌పురం, రామకొండ, ముక్కెల్లలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు బూత్ కమిటీలతో సమావేశం నిర్వహించారు. సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు, వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకరరెడ్డి, బంటుపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి బూత్ స్థాయి కమిటీ నాయకులు ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. పార్టీ నాయకులు గోవర్ధన రెడ్డి, లక్ష్మణస్వామి, నాగరాజు, చాణక్య పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): రాబోవు సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ బూత్ లెవల్లో సిద్ధంగా ఉందామని, తగిన కార్యచరణతో ముందుకు సాగుతూ వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామని పార్టీ నియోజకవర్గ నాయకుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన గురువారం వెల్దుర్తి పార్టీ కార్యాలయంలో బూత్ లెవల్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి బూత్ ఏజెంట్‌కు 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' పోస్టర్లు, కరపత్రాలు అందించారు. రామ్మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పల్లెపల్లెనా చేసిన అభివృద్ధి ప్రతి ఓటరుకు వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేసేలా చూడాలన్నారు. నాయకులు వెంకట్‌నాయుడు, కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, మాలిక్ బాష, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో బూత్ కమిటీలను ఏర్పాటు చేసి, జగనన్న చేసిన మంచిని ఇంటింటికీ వెళ్లి వివరించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు సూచించారు. ఈ మేరకు గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమై 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం పోస్టర్‌లను విడుదల చేశారు. మండల కో-కన్వీనర్ కబీర్‌దాసు, నాయకులు వెంకటేష్, రాజారెడ్డి, యూసఫ్, వడ్డె ఉరుకుందు తదితరులు పాల్గొన్నారు.

చెరుకులపాడు జెడ్పీ విద్యార్థినుల ఘనత


రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి అందుకుంటున్న చెరుకులపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు

వెల్దుర్తి(కృష్ణగిరి): విజయవాడలోని పోరంకి మురళీ రిసార్ట్స్‌లో పాఠశాల విద్యాశాఖ బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంటర్‌ప్రెన్యూయల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఈఎండీపీ) పోటీల్లో వెల్దుర్తి మండలం చెరుకులపాడు జెడ్పీ హైస్కూల్ ప్రాజెక్టుకు మొదటిస్థానం లభించింది. రాష్ట్రస్థాయిలో 26 జిల్లాల నుంచి 52 ప్రాజెక్టులు ప్రదర్శనకు రాగా చెరుకులపాడు పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఎ.రేణుక, 7వ తరగతి విద్యార్థిని కె.వాణి సంయుక్తంగా రూపొందించిన 'స్మార్ట్ కంపోస్టు క్రషర్' ప్రాజెక్టు ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైంది. ఈ మేరకు ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన బహుమతుల ప్రదాన కార్యక్రమంలో విజేతలైన రేణుక, వాణి అవార్డు, సర్టిఫికెట్లు అందుకున్నారు. 'స్మార్ట్ కంపోస్టు క్రషర్'ను ఉపయోగించి తడి చెత్తను తక్కువ సమయంలో సారవంతమైన పోషకాలు గల ఎరువుగా మార్చవచ్చని ప్రాజెక్ట్ గైడ్, సైన్స్ టీచర్ చాముండేశ్వరి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం చెరుకులపాడు పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి విద్యార్థినులను అభినందించారు. అలాగే విద్యార్థినులు, ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అభినందనలు తెలిపారు.

పంచాయతీ ఆదాయం పెంపునకు కృషి

హొళగుంద: గ్రామాభివృద్ధి కోసం పంచాయతీ ఆదాయం పెంపునకు సర్పంచ్, వైస్ సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు కృషి చేయాలని హెబ్బటం ఇన్‌చార్జ్ పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ సూచించారు. గురువారం హెబ్బటం పంచాయతీ కార్యలయంలో సర్పంచ్ కృష్ణవేణి ఆధ్వర్యంలో వార్డు మెంబర్లతో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్ల వ్యవస్థ ఇతర అన్నింటిపై దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. పంచాయతీకి ఆదాయ వనరులైన పన్నుల వసూలు, ఇతర వాటిపై దృష్టి సారించి తద్వారా వచ్చే నిధులను అభివృద్ధి పనులకు వాడుకుంటామన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించేలా అవగాహన కల్పించాలని వార్డు సభ్యులను కోరారు. వైస్ సర్పంచ్ సవారప్ప, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు నరసప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.